సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



నవ్వులు పంచిన ఎన్‌హెచ్ 316

కళాభారతి ఆడిటోరియంలో గురువారం ప్రదర్శించిన ఎన్‌హెచ్ 316 నాటకం ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. 8లో



రైల్వేస్టేషన్ వద్ద చెక్‌పోస్ట్

విశాఖ రైల్వేస్టేషన్ వద్ద నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డైనమిక్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. 8లో



నమో.. సూర్యదేవా..

ఛట్ పూజల్లో భాగంగా ఉత్తరాది ప్రజలు గురువారం సాయంత్రం ఆర్.కె.బీచ్‌లో సూర్య భగవానుడిని ఆరాధించారు. 8లో

న్యూస్‌రీల్

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపండి

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



సమస్యల పరిష్కారంపై ఆరా తీస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: గత సర్వ సభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు/అభ్యంతరాలకు పరిష్కార మార్గం చూపించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి.. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో గత సర్వ సభ్య సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యల పరిష్కార చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి ముందే గత కౌన్సిల్‌లో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలన్నారు. జీరో అవర్ సమస్యలకు సంబంధించి చేపట్టిన పరిష్కార చర్యలపై మరో సమీక్ష నిర్వహిస్తామని మేయర్ చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన ప్రతి సమస్యకూ సమాధానం/పరిష్కార మార్గాలను అధికారులు సిద్ధం చేశారని వివరించారు. అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ఎస్ ఎస్ వర్మ, కార్యదర్శి బి.వి. రమణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

మిజోరం నిట్‌తో వైజాగ్ ఐఐఎం ఒప్పందం



పత్రాలు మార్చుకుంటున్న ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్, నిట్ డైరెక్టర్ సుందర్

సాక్షి, విశాఖపట్నం : మేనేజ్‌మెంట్ విద్యను అందించే విషయంలో మిజోరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)తో విశాఖ ఐఐఎం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. మేనేజిరియల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కీలకమైన అభివృద్ధి సాధించేందుకు ఈ ఎంవోయూ దోహదపడనుంది. మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమ, గవర్నర్ కంభంపాటి హరిబాబు నేతృత్వంలో నిట్ డైరెక్టర్ డా.సుందర్, ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొ.ఎం చంద్రశేఖర్ ఒప్పంద పత్రాలపై గురువారం సంతకం చేశారు. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు మేనేజ్‌మెంట్ విద్యని మరింత చేరువ చేసేందుకు ఈ ఒప్పందం చేసుకున్నామని ఐఐఎంవీ డైరెక్టర్ తెలిపారు. ఇది ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక సంస్థలు (సీఎఫ్‌టీఐలు), జాతీయ సంస్థల కోసం రూపొందించినట్లు తెలిపారు.

నేడు పుష్పయాగ సంకల్పం

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం పుష్పయాగ సంకల్పం నిర్వహించనున్నారు. ఈ నెల 9న తిరుమలలో శ్రీవారి పుష్పయాగం జరగనుంది. ఈ నేపథ్యంలో టీటీడీ గార్డెన్ విభాగం శ్రీవారి పుష్పయాగానికి పూలు పంపించాల్సిందిగా విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీని కోరింది. దీంతో శుక్రవారం ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి, నగర భక్తుల నుంచి పుష్పాలు సేకరించడంతో పాటు టీటీడీ కల్యాణ మండపంలో వాటికి సంకల్పం చేయనున్నట్లు కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ వెల్లడించారు. అనంతరం ఆ పుష్పాలను శ్రీవారి పుష్పయాగానికి తిరుమల పంపించనున్నట్లు తెలిపారు.

నిరాశ్రయుల వసతి గృహాలకు సొంత భవనాలు



కమిషనర్ సంపత్‌కుమార్‌కి స్వాగతం పలుకుతున్న నిరాశ్రయులు

సీతమ్మధార: నిరాశ్రయుల వసతి గృహాలకు సంబంధించి శాశ్వత భవనాలను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. టీఆర్‌ఎస్ కాంప్లెక్స్‌లో జీవీఎంసీ సహకారంతో ఏయూటీడీ సంస్థ నిర్వహిస్తున్న వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. రెండో అంతస్తుపై ఉన్న నిరాశ్రయుల వసతి గృహానికి నాలుగు నెలలుగా నీరు రాక 85 మంది నిరాశ్రయులు ఇబ్బందులు పడుతున్నారని ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగతి వాసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన.. వారంలో సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) ఫణిరాం పాల్గొన్నారు.

వింటర్‌లో రివ్వు రివ్వున





చలికాలం అంటేనే.. పర్యాటకులకు పండగ. అందుకు విశాఖపట్నం విమానాశ్రయం వింటర్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3 విమానాలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. మొత్తంగా ప్రతి రోజూ ఇక్కడి నుంచి 70 విమాన సర్వీసులు ఉండనున్నాయి. ఇందులో మూడు విదేశీ సర్వీసులు కావడం విశేషం.

- విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి రోజూ 70 విమాన సర్వీసులు
- ఈ ఏడాది మరో మూడు విమానాలు అందుబాటులోకి..
- వింటర్ షెడ్యూల్ విడుదల చేసిన వైజాగ్ ఎయిర్‌పోర్ట్
- అక్టోబర్‌లో పెరిగిన ప్రయాణికుల రాకపోకలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూల్ ఖరారైంది. శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ సీజన్‌లో విమానయాన సంస్థలు విమాన సర్వీసులను పెంచుతూ ఉంటాయి. గత సీజన్‌లో విశాఖ నుంచి 32 విమానాలు నడవగా.. ఈ ఏడాది మరో 3 విమానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అంటే ఈ శీతాకాలంలో 35 విమానాలు ఇక్కడ నుంచి ఎగరనున్నాయి.

మొత్తంగా శీతాకాలం షెడ్యూల్ ప్రకారం సుమారు 70 విమాన సర్వీసులు వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించనున్నాయి. గతేడాదితో పోలిస్తే బెంగళూరుకి సర్వీసులు తగ్గగా.. ఈసారి హైదరాబాద్, విజయవాడకు సర్వీసులు పెరిగాయి. అదేవిధంగా 2023 శీతాకాలంలో విదేశాలకు ఒకే ఒక్క సర్వీసు (సింగపూర్) మాత్రమే ఉండేది. వేసవి కాలం నాటికి మలేషియా(కౌలాలంపూర్), బ్యాంకాక్‌కు అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. ఈ శీతాకాలంలో ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, జైపూర్, పోర్ట్‌బ్లెయిర్, కర్నూలు, కోల్‌కతా, తిరుపతి, ముంబై తదితర నగరాలకు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో కొన్ని ప్రతి రోజూ సర్వీసులుండగా.. మరికొన్ని వారంలో మూడు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నాయి.

అక్టోబర్‌లో ప్రయాణికులు, విమాన సర్వీసుల రాకపోకలు

దేశీయ ప్రయాణికుల రాకపోకలు	
2023 అక్టోబర్‌లో	2,32,004
2024 అక్టోబర్‌లో	2,52,499
వృద్ధి రేటు	8.83 శాతం

దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు	
2023 అక్టోబర్‌లో	1732
2024 అక్టోబర్‌లో	1855
పెరిగిన సర్వీసులు	123
వృద్ధి రేటు	7.10 శాతం

అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు	
2023 అక్టోబర్‌లో	5175
2024 అక్టోబర్‌లో	9576
వృద్ధి రేటు	85.04 శాతం

అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు	
2023 అక్టోబర్‌లో	35
2024 అక్టోబర్‌లో	77
పెరిగిన సర్వీసులు	42
వృద్ధి రేటు	120 శాతం

అక్టోబర్‌లో అదరగొట్టింది



అక్టోబర్ నెలలో వైజాగ్ ఎయిర్‌పోర్టు అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకల పరంగానూ, విమాన సర్వీసుల పరంగానూ విశాఖ ఎయిర్‌పోర్టు మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2023 అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది 8.83 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. డొమెస్టిక్ విమాన సర్వీసుల విషయంలోనూ 7.10 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలోనూ అదే జోరు కొనసాగింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో 85.04 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో ఏకంగా 120 శాతం నమోదైంది. గతేడాదితో పోలిస్తే.అదనంగా రెండు సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.

మరిన్ని సర్వీసులు పెంచేందుకు కృషి



వచ్చే మార్చి 29 వరకూ వింటర్ షెడ్యూల్ విడుదల చేశాం. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర విమానయాన శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపాం. దుబాయ్‌కు విమాన సర్వీసు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. డిజి యాత్రకు మంచి స్పందన లభిస్తోంది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాజారెడ్డి, వైజాగ్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

15 నుంచి ఇసుక విక్రయాలు

- గాజువాక, ఆరిలోవ, భీమిలి ప్రాంతాల్లో డీలర్ల ద్వారా అమ్మకాలు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి



మహారాణిపేట: జిల్లాలో గాజువాక, ఆరిలోవ, భీమిలి ప్రాంతాల్లో ఈనెల 15వ తేదీ నుంచి ఇసుక అమ్మకాల కోసం ముగ్గురికి మినరల్ డీలర్ లైసెన్స్(ఎండీఎల్) జారీ చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ డీలర్ టన్ను రూ.750కి విక్రయిస్తారని, అక్కడ నుంచి సొంత వాహనంలో ఇసుక తీసుకొని వెళ్లవచ్చన్నారు. ప్రభుత్వం తరపున తక్కువ ధరకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. పది కిలో మీటర్లకు రూ.1500, 20 కిలోమీటర్లుకు రూ.2 వేలు, 30 కిలో మీటర్లకు రూ.2,500 రవాణా చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. డీలర్లు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ఇసుక తీసుకొచ్చి విక్రయించాలన్నారు. ఒక్కొక్కరికి పది టన్నుల మేర ఇసుక విక్రయించాలని నిర్ణయించామన్నారు. ఇక్కడ ఇసుక నిల్వలు చేసుకోవడానికి ప్రభుత్వ స్థలం కేటాయిస్తామన్నారు.

సీఎం హామీలు అమలు కోసం కార్యాచరణ

విశాఖ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలతోపాటు సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయడానికి కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ చెప్పారు. వారంలో ఒక రోజు సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్షలు చేస్తామన్నారు. మెట్రో కారిడార్‌కు సంబంధించి 12 ఫ్లై ఓవర్లు వస్తాయని, వీటిలో రెండు లంకెలపాలెం వైపు, మిగిలిన పది స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు ఉంటాయని తెలిపారు. ఫ్లై ఓవర్లు, రహదారి, మెట్రోతో కూడిన కారిడార్ నిర్మాణానికి కిలో మీటర్‌కు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వం కొంత మేర ఇచ్చే అవకాశం ఉందని, 16 మీటర్ల ఎత్తులో జీ ప్లస్–2 తరహాలో మెట్రో వస్తుందన్నారు. నగర పరిసరాల్లో పచ్చదనం పెంపొందించడానికి మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు. సింహాచలం భూ సమస్యను పరిష్కరించడంలో భాగంగా ప్రత్యామ్నాయ భూముల కోసం అన్వేషణ చేస్తున్నామన్నారు. గాజువాక, ఇతర భూములపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామన్నారు. వెంకటేశ్వరమెట్ట, ఇసుక కొండ ఇతర భూముల్లో ఆక్రమణలు ఉన్నాయని, వీటి క్రమబద్ధీకరణతోపాటు ఇతర అంశాలపై సీఎం సమీక్షలో చర్చించారన్నారు.

విశాఖ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే.. పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖ అభివృద్ధికి ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధమైందని, అతి త్వరలో కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన సీఐఐ 4వ జోనల్‌స్థాయి సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా రోడ్ల అనుసంధానంపై దృష్టి సారించామని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎక్స్‌ప్రెస్ కారిడార్లు ఏర్పాటు చేస్తామన్నారు. దువ్వాడ, అచ్యుతాపురం, గంగవరం పోర్టు, ఇతర పారిశ్రామికవాడల నుంచి సులభంగా ట్రాన్స్‌పోర్ట్ జరిగేలా రోడ్లను అభివృద్ధి చేసి అనుసంధానిస్తామని తెలిపారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు ఉన్న ప్రధాన కూడళ్లలో ఫ్లైఓవర్లు లేదా ఎక్స్‌ప్రెస్ కారిడార్లు నిర్మిస్తామని తెలిపారు. నగరంలో నిరంతరం తాగునీటి సరఫరా జరిగేలా చూస్తామని, 100 శాతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. పీపీపీ విధానంలో ప్రాజెక్టులు చేపట్టి.. జిల్లా సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడతామని, ఆ దిశగా అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు పారిశ్రామిక వేత్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పరిశ్రమలకు సమీపంలో ఉండే ప్రజలతో పారిశ్రామికవేత్తలు సత్సంబంధాలు కొనసాగించాలని, సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రజలు, ఉద్యోగుల ప్రాణ రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐఐ ఏపీ సెక్టార్ చైర్మన్ మురళీ కృష్ణ, సీఐఐ విశాఖ జోన్ చైర్మన్ గ్రంధి రాజేష్, ఇతర సభ్యులు పలు అంశాలపై సలహాలు, సూచనలు అందజేశారు. టెంపుల్, ట్రావెల్ టూరిజంకు అధిక ప్రాధాన్యమివ్వాలని, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందజేయాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి సహకారం అందించాలని కోరారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశంలో 71 అజెండా అంశాలను పొందుపరిచారు.

అందరి సమన్వయంతో పార్టీ బలోపేతం





మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్టీ నేతలు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడతాం
- కార్యకర్తలకు పెద్ద పీట వేస్తాం
- 2027 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

విశాఖ సిటీ : ఉత్తరాంధ్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని సమన్వయం చేసుకుంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తర్వాత ఆయన విశాఖలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో గురువారం లాసెన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వై.వి. సుబ్బారెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేశారని, దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. గతంలో పాలన చేసిన అనుభవంతో ఉత్తరాంధ్రలో పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వారితో మమేకమయ్యేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ అంశంలో చంద్రబాబు చెతులెత్తేశారని, వైఎస్సార్ సీపీ మాత్రం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు.. ఇలా అందరిని సమన్వయం చేసుకుంటూ.. 2027 చివరిలో జరిగే ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు. గతంలో పార్టీ కార్యకర్తలను విస్మరించిన మాట వాస్తవమే అని.. ఇప్పుడు వారికి పూర్తి ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, కె.భాగ్యలక్ష్మి, శోభ హైమావతి, పి.వరలక్ష్మి, సమన్వయకర్తలు కేకే రాజు, మలసాల భరత్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల రవికుమార్(రవిరెడ్డి), ఉరుకూటి అప్పారావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం సందర్శన

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి తొలిసారిగా సందర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

అయ్యవార్లకు పంగనామాలు!

- ప్రమోషన్లలో మున్సిపల్ టీచర్లకు మొండిచేయి
- డీఎస్సీ బూచితో పోస్టులను బ్లాక్‌లో పెట్టిన అధికారులు
- సీనియార్టీ జాబితాలపై అంతా గోప్యత
- కూటమి ఎమ్మెల్సీ కనుసన్నల్లోనే విద్యాశాఖ నిర్ణయాలు

విశాఖ విద్య: మున్సిపల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలనే విద్యాశాఖ డైరక్టరేట్ నుంచి వచ్చిన షెడ్యూల్‌కు జిల్లా విద్యాశాఖాధికారులు తిలోదకాలిచ్చేశారు. ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా, ప్రమోషన్ కోటా మేరకు అందుబాటులోని ఖాళీలను బహిర్గతం చేయకుండా అంతా గోప్యత పాటిస్తున్నారు. ప్రమోషన్ ఎవరికి వస్తుంది? అసలు ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయం తెలుసుకునే పరిస్థితులు లేకుండా చేపడుతున్న ప్రమోషన్ల ప్రక్రియపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో జిల్లా విద్యాశాఖపై కూటమికి చెందిన ఓ ఎమ్మెల్సీ చేస్తున్న ఆధిపత్యానికి.. ఇక్కడి అధికారులు సైతం తలొగ్గుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాహాటంగా విమర్శిస్తున్నారు.

జీవీఎంసీ స్కూళ్లలో ఖాళీలు ఇలా..

గ్రేటర్ మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలోని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో రాబోయే డీఎస్సీకి 109 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్(ఫస్ట్ లాంగ్వేజ్)–10, స్కూల్ అసిస్టెంట్ (సెకండ్ లాంగ్వేజ్)–4, ఇంగ్లిష్–7, గణితం–2, ఫిజికల్ సైన్స్–3, బయాలజీ–10, సోషల్–6, సెకండరీ గ్రేడ్ టీచర్స్–67 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు లెక్క చూపించారు. వీటిని డీఈవో కార్యాలయ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

ఖాళీల గోప్యతపై మర్మమేమిటో.?

మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి వచ్చిన షెడ్యూల్ మేరకు ఈ నెల 4న ఇద్దరు గ్రేడ్–2 హెచ్ఎం పోస్టుల్లో అర్హులైన వారికి డీఈవో కార్యాలయ అధికారులు ప్రమోషన్ కల్పించారు. కాగా శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి. స్కూల్ అసిస్టెంట్ గణితం–1, ఫిజికల్ సైన్స్–5, సోషల్–1 తెలుగు –7 ఫిజికల్ డైరెక్టర్ –1, ఒరియా–1, పీఎస్ హెచ్ఎం–5 పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిసింది. అయితే ఖాళీలకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం వరకు కూడా డీఈవో కార్యాలయ అధికారులు బహిర్గతం చేయలేదు. అంతా గోప్యత పాటిస్తుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



విశాఖలోని డీఈవో కార్యాలయం

డీఎస్సీ కోసం ప్రమోషన్లలో కోత

జీవీఎంసీ పరిధిలో ఖాళీగా ఉన్న 109 పోస్టుల్లో ఎస్జీటీ 67 పోనూ మిగిలిన 42 పోస్టుల్లో 70 శాతం పోస్టులు ప్రమోషన్ల ద్వారా, మిగిలిన 30 శాతం డైరెక్ట్ రిక్రూట్ మెంట్(డీఎస్సీ) ద్వారా భర్తీ చేయాలన్న నిబంధన ఉంది. విద్యాశాఖనే కాదు, ఇతర ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ ఇదే రీతిన ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఉంటుంది. కానీ ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వారికి ఇలాంటి నిర్ణయాలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. బయాలజీ 10 పోస్టులు ఖాళీగా ఉన్నప్పుడు వీటిలో 7 పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలి. కానీ ఏ ఒక్కరికీ అవకాశం లేకుండా.. పోస్టులన్నీ డీఎస్సీ కోసమని బ్లాక్ చేశారు. ఇంగ్లిష్, హిందీ వంటి సబ్జెక్టుల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. విద్యాశాఖ చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని, కూటమి ప్రభుత్వంలో ఇచ్చే ప్రమోషన్లు ఇలాగే ఉంటాయా? అంటూ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సర్వీస్ రిజిస్టర్ల పరిశీలన ఎక్కడ?

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చే సమయంలో వారి సర్వీసు రిజిస్టర్లు పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి. గతంలో ఇలానే చేశారు. అయితే షెడ్యూల్ మేరకు అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలి. కానీ గురువారం సాయంత్రం వరకు ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రకటించలేదు. ప్రొవిజనల్ జాబితాపై ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలకు పరిష్కారం చూపలేదు. ఇలా హడావుడి చేపట్టిన ప్రమోషన్ల ప్రక్రియలో పారదర్శకతపై ఉపాధ్యాయులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతమ్మధార: ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌పీసీఎల్)లో ఇగ్నైట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఐఐఏటీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ వెల్డర్, పైప్ ఫిట్టర్, ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో బి.వి.ఎస్.వంశీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, ఐటీఐ అర్హత ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఇక్కడ 60 నుంచి 80 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న 18 నుంచి 27 ఏళ్ల వయసు గలవారు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 79813 36432, 83746 60705ను సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు ఇస్లాంపేట విద్యార్థిని


అనిత బొహిపాయి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అనిత బొహిపాయి జాతీయ హాకీ జట్టులో స్థానం సంపాదించుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌతమాపూర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 5 వరకు రాష్ట్రస్థాయి అండర్–17 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అనిత ప్రతిభ చూపి.. జాతీయ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల హెచ్‌ఎం జి.ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నరసింహమూర్తి, కోచ్‌లు టిగ్గా, పీటర్ అభినందించారు.

• నమో.. సూర్యదేవా..

ఘనంగా ఛట్ పూజ


విద్యుత్ కాంతుల్లో ఛట్ పూజా ప్రాంగణం

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూక్యాంపస్: ఉత్తరాది రాష్ట్రాల సంప్రదాయ పండగైన ఛట్ పూజ విశాఖలో ఘనంగా జరిగింది. విశాఖలో నివసిస్తున్న వేలాది ఉత్తరాది ప్రజలు గురువారం సాయంత్రం ఆర్.కె.బీచ్‌కు చేరుకుని సూర్య భగవానుడిని ఆరాధించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజలో పాల్గొని, ఉత్తరాది ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయించే సూర్యుడితో పాటు అస్తమించే సూర్యుడిని పూజించే ఈ సంప్రదాయం ఎంతో ప్రత్యేకమైనదని సీపీ అన్నారు. ఈ సందర్భంగా ఛట్ పూజ సమితి ప్రతినిధి సుభాష్ చంద్రరాయ్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా విశాఖలో ఈ పండగను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సూర్య భగవానుడి ఆశీస్సులు కోరుతూ, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఈ పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండగలో ప్రసాదంగా ఉపయోగించే చెరకు, బెల్లం, కొబ్బరి, అరటి, పసుపు, అల్లం ఆరోగ్యానికి ఎంతో మంచిదని వివరించారు. ఉత్తరాది మహిళల సంప్రదాయ వేషధారణ, ఇసుక తిన్నెలపై దీపాలను వెలిగించి సూర్య భగవానుడిని ఆరాధించే విధానం విశాఖ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్తరాది ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం కలిగిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు


సూర్యభగవానుడికి నమస్కరిస్తున్న ప్రజలు

రైల్వేస్టేషన్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు

24/7 తనిఖీలు చేసేందుకు ఏర్పాట్లు


రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

సీతమ్మధార: విశాఖ రైల్వేస్టేషన్ వద్ద నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డైనమిక్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్ట్ 24 గంటలూ పనిచేస్తుందని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ చెక్ పోస్ట్‌లో మొత్తం ఐదుగురు సిబ్బంది షిఫ్టుల విధానంలో పని చేస్తారని.. వారికి జనరల్ డైరీ, డ్రాగన్ లైట్లు, బాడీ వార్న్ కెమెరాలు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకుని విచారించాలని సిబ్బందిని ఏసీపీ ఆదేశించారు. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్.విజయకుమార్, టూ టౌన్ సీఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయం అవసరమైన ప్రజలు డయల్ 112 లేదా కింది నంబర్లను సంప్రదించవచ్చు

సీపీ శంఖబ్రత బాగ్చి	79950 95799
ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి	94407 96005
ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్	94407 96012
టూ టౌన్ సీఐ తిరుమలరావు	94409 04716
జీఆర్పీ సీఐ	94406 27547
ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్	0891-2710695
కంట్రోల్ రూమ్	94906 24787, 0891-2565454

'కౌశల్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖ విద్య: కౌశల్–2024(రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు)కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం డీఈవో ప్రేమ్ కుమార్ ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులను ఇందులో భాగస్వామ్యం చేసేలా హెచ్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ నెల 15లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా విద్యార్థులను చైతన్యపరచాలన్నారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల విద్యార్థులకే ఈ అవకాశం ఉందని, దీనిపై పాఠశాల స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కౌశల్ రాష్ట్ర బాధ్యులు ఎం.పి.శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు నాగేశ్వరరావు, రామలక్ష్మి, ఎం.వి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సంద్రం.. వర్ణ సంగమం

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పెదజాలారిపేట వద్ద సముద్రం ఎరుపు రంగులోకి మారి ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా నీలి రంగులో కనిపించే సముద్రం ఇలా ఎర్రగా మారడానికి అనేక కారణాలు ఉండొచ్చని ఓషనోగ్రఫీ నిపుణులు చెబుతున్నారు. సముద్రపు నీటిలో ఆమ్లత్వం, ఆక్సిజన్ స్థాయిలు పెరిగినా.. నోక్టిలుకా బ్లూమ్ వంటి సూక్ష్మజీవుల వల్ల కూడా రంగు మారే అవకాశం ఉందంటున్నారు. దీంతో పాటు.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు కాలువల ద్వారా వచ్చి సముద్రంలో చేరినప్పుడు కూడా ఇలా కొంత దూరం వరకూ రంగు మారినట్లు కనిపిస్తుంటుంది. వరద నీరు సముద్రంలో కలిసేందుకు కనీసం వారం నుంచి 10 రోజులు పట్టే అవకాశం ఉంది. పెద జాలారిపేట వద్ద ఓ ప్రధాన కాలువ ఉండటంతో.. దీని వల్ల కూడా రంగుమారి ఉంటుందని భావిస్తున్నారు. -సాక్షి, విశాఖపట్నం

దారి దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు

విశాఖ సిటీ: జాతీయ రహదారిపై లారీలు ఆపి వారిపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు దోచుకుంటున్న నలుగురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన రెల్లి రాంబాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి 11 గంటలకు మాంగనీస్ లోడుతో టి.కృష్ణ అనే క్లీనర్‌తో కలిసి విశాఖ పోర్టు నుంచి బొబ్బిలికి బయలుదేరాడు. హనుమంతవాక జంక్షన్ దాటిన తరువాత విమ్స్ ఆస్పత్రి గేటు వద్ద రాత్రి 11.30 గంటలకు ఒక స్కూటీపై ఇద్దరు అగంతకులు వచ్చి లారీని ఆపారు. ఇంతలో వెనుక నుంచి మరో ఇద్దరు యువకులు చేరుకున్నారు. ఆ నలుగురు డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను లారీ నుంచి కిందకి లాగి డబ్బులు డిమాండ్ చేశారు. వారి వద్ద లేవని చెప్పడంతో ముఖంపై దాడి చేశారు. ఇదే సమయంలో ఆ వెనుక వస్తున్న లారీ డ్రైవర్ రెల్లి అప్పలనాయుడు అది చూసి వారి వద్దకు వెళ్లాడు. అతనిపై కూడా దాడి చేసి రూ.450 నగదు, సెల్‌ఫోన్లు లాక్కొని పారిపోయారు. వెంటనే బాధితులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీసీపీ(క్రైమ్) లతా మాధురి ఆదేశాల మేరకు ఏడీసీపీ(క్రైమ్) ఎ.వేంకట్రావు, సీసీఎస్ జోన్–1 ఏసీపీ ఆధ్వర్యంలో ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.బంగారుపాప, ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణ, సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు దర్యాప్తు చేపట్టగా నిందితులను గుర్తించారు. పెదగదిలికి చెందిన కడుపుట్ల సందీప్, ఆరిలోవకు చెందిన అంగటి సాయి, ఎండాడకు చెందిన సి.హెచ్.రాము, ధర్మాల రాములను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి రూ.450 నగదు, రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. కేసును ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలి

మహారాణిపేట: గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రీ సర్వే వర్క్‌షాప్‌లో జేసీ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మండలాల్లో గల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి భూములు రీ సర్వే చేయాలన్నారు. రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో వచ్చిన అభ్యంతరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ వర్క్‌షాపులో ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రూ.38.43 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

- నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు విక్రయించిన స్విగ్గీ బాయ్స్
- విజయవాడలో ఐదుగురి అరెస్ట్

విశాఖ సిటీ : పార్ట్ టైం ఉద్యోగాల పేరిట టోకరా వేసిన సైబర్ నేరగాళ్ల కోసం దర్యాప్తు చేపట్టగా.. వారికి బ్యాంక్ ఖాతాలు విక్రయించిన స్విగ్గీ బాయ్స్ ఇరుక్కుపోయారు. కమీషన్ వస్తుందన్న ఆశతో బ్యాంక్ అకౌంట్లను ఇచ్చిన ఐదుగురు స్విగ్గీ బాయ్స్‌ని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ పార్ట్ టైం జాబ్ పేరుతో ప్రకటన వచ్చింది. దీంతో అతడు ఆ లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నింపాడు. తరువాత అతడికి మూడు లింక్‌లు పంపించి అందులో వీడియో చూసి లైక్ చేయమని, చేసిన తరువాత వాటి స్క్రీన్ షాట్లు పెట్టమని మెసేజ్ చేశారు. అనంతరం టెలిగ్రామ్ యాప్ గ్రూప్‌లో అతడిని యాడ్ చేసి ఆ తరువాత చేయాల్సిన టాస్కులను వివరించారు. ఆ టాస్కులు చేస్తే డబ్బులు సంపాదించవచ్చని నమ్మించారు. ముందుగా ప్రీపెయిడ్ టాస్కుల పేరుతో రూ.1,000, రూ.1,300, రూ.3,900 ఇలా నగదు అందించారు. ఇంకా అధిక కమీషన్ ఇస్తామని నమ్మించి రూ.32,500 నుంచి దఫదఫాలుగా రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్‌మెంట్ పేరిట కట్టించుకున్నారు. వారినుంచి ఎటువంటి డబ్బు రాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో ఇప్పటివరకు సైబర్ నేరగాళ్లు రూ.38.43 లక్షలు దోచుకున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతికత సహాయంతో దర్యాప్తు చేపట్టారు. నగదు లావాదేవీల ప్రకారం.. విజయవాడకు చెందిన ఐదుగురిని పట్టుకున్నారు. వారిని విచారించగా.. వాళ్లు స్విగ్గీలో డెలివరీ బాయ్స్‌గా తేలింది. టెలిగ్రామ్ ద్వారా బ్యాంక్ ఖాతాలు విక్రయించి.. నేరగాళ్లు చెప్పిన విధంగా చేస్తున్నట్టు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా.. ఏపీతోపాటు తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, బిహార్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 93 కేసులు నమోదైనట్టు గుర్తించారు. అసలు సూత్రధారుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జేఎల్‌ఎం మృతి.. ఇద్దరు ఉద్యోగులపై చర్యలు

మధురవాడ: విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొమ్మాది సెక్షన్ పరిధి లైన్‌మన్, ఎల్ఐలపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు ఈపీడీసీఎల్ విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పై అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా జూనియర్ లైన్‌మన్ వెంకటేష్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈఈ గురువారం మధురవాడలోని జోనల్ కార్యాలయంలో ఏఈలు, జేఈలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్టాఫ్, జేఎల్‌ఎంలతో సమావేశమయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నపాటి నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుందన్నారు. విధుల్లో క్రమశిక్షణతో పాటు భద్రతా పరికరాలు ఉపయోగించాలని సూచించారు. హెల్మెట్ ధరించి ఉంటే వెంకటేష్ ప్రాణం పోయి ఉండేది కాదన్నారు. బ్రేక్‌డౌన్ వచ్చినప్పుడు జేఎల్ఎంతో పాటు ఇతర సిబ్బందినైనా పంపించాలని లేదా అతని పైఅధికారులైనా వెళ్లాలని స్పష్టం చేశారు. అలా చేయనందుకు లైన్‌మన్ పి.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశామని, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు చార్జ్ మెమో జారీ చేసినట్లు ఈఈ తెలిపారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్‌కార్డు ఉద్యమం

10న ఆర్కేబీచ్‌లో ప్రారంభం


పోస్టు కార్డులను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ వి.వి.రమణమూర్తి

సీతంపేట: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో జరిగే 10 లక్షల పోస్టు కార్డుల ఉద్యమానికి ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పలు ప్రజా సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో పోస్టు కార్డుల ఉద్యమానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ పది లక్షల పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టామని తెలిపారు. ఒక సమస్యపై దేశ ప్రధానికి 10 లక్షల పోస్టు కార్డులు పంపడం ప్రపంచ చరిత్రలో రికార్డుగా మిగులుతుందన్నారు. రెస్పెక్టెడ్ ప్రైమ్ మినిస్టర్, ప్లీజ్ విత్ డ్రా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్'అని ఆంగ్లంలో రాసి పోస్టు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10న ఆర్కేబీచ్ రోడ్ కాళీమాత ఆలయం వద్ద ఉదయం 6 గంటలకు ఈ ఉద్యమం ప్రారంభిస్తామని తెలిపారు. పోస్టు కార్డులు కావాల్సినవారు 9490690458, 8790012918 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇప్టూ వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నేత లలిత, దళిత నాయకుడు వేమన, కాంగ్రెస్ నాయకుడు సోడదాసు సుధాకర్, భీమ్‌సేన వార్ నాయకుడు వసంత రాజేంద్రప్రసాద్, న్యాయవాది సలీం, భారత నాస్తిక సమాజం శ్రీరామ్మూర్తి, విదసం నాయకుడు బూసి వెంకటరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సివిల్ సర్వీసెస్ టెన్నిస్ జట్టుకు రమేష్ ఎంపిక

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ టెన్నిస్ జట్టుకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన అన్ని మ్యాచ్‌ల్లో ఆయన విజయం సాధించడంతో ఏపీ సివిల్ సర్వీసెస్ జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఏపీ సివిల్ సర్వీసెస్ తరఫున ఆయన పాల్గొంటారు.

నవ్వులు పంచిన ఎన్‌హెచ్ 316


నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: భువనేశ్వర్‌కు చెందిన అభినయ జాగృతి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ థియేటర్ కళాకారులు ప్రదర్శించిన ఎన్‌హెచ్ 316 అనే ఒడియా నాటకం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. రసజ్ఞ జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా కళాభారతి ఆడిటోరియంలో గురువారం ప్రదర్శించిన నాటకం ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. నాటకంలో పాత్రధారులు వారి నటన కౌసల్యంతో ప్రేక్షకులు మెప్పించారు. ప్రతి సన్నివేశాన్ని కళ్లకట్టినట్టుగా అభినయం చేసి ఆకట్టుకున్నారు. అలయ్ అనే పట్టణంలోని ప్రజలందరికీ కష్టాలుంటాయి. చాలా ఏళ్లుగా సంతోషం పోరాటం చేస్తుంటారు. తమ జీవితాలను పట్టి పీడిస్తున్న ఒత్తిడి, అసంతృప్తి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. కథ ఇలా నడుస్తున్నప్పుడు వచ్చిన ఒక రహస్య లేఖ.. వారిలో ఉత్సుకతను, గందరగోళాన్ని సృష్టిస్తుంది. నాటకంలోని ప్రతీ పాత్ర వచ్చిన ఉత్తరంలోని విషయాలను ఆత్రంగా ఎదురుచూస్తుండగా.. వారిలో విచిత్రమైన అభద్రతా భావాలు బయటపడుతుంటాయి. వారిలో కోరికలు, భయాలు, లోపాలు తదితర భావోద్వేగాలతో హాస్యభరితంగా సాగిన నాటకం అందరినీ కడుపుబ్బా నవ్వించింది.

అర్హులందరికి ఉచిత గ్యాస్ సబ్సిడీ


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సబ్సిడీ అమౌంట్ అందించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో దీపం పథకంపై ఆయన సమీక్షించారు. గ్యాస్ సబ్సిడీపై ప్రజలు ఆందోళన చెందవద్దని, ఈ కేవైసీ చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. లబ్ధిదారులు గ్యాస్ డీలర్ వద్ద లేదా గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ ద్వారా ఈ–కేవైసీ చేసుకోవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ కోసం ముందుగా డబ్బులు చెల్లిస్తే సబ్సిడీ పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లోగా.. గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. ఈ పథకం పొందడంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోను, స్థానిక సచివాలయంలోను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్యాస్ డెలివరీ సమయంలో ఎవరైనా అదనపు చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు అన్ని కేటగిరీల్లో 93,784 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా 54,011 మందికి డెలివరీ చేశారని, వాటిలో అర్హులైన 37,385 మందికి రూ.3 కోట్లు దీపం పథకం కింద లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో వి.భాస్కరరావు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- రెండు రోజుల క్రితం క్రికెటర్ విరాట్ కోహ్లీ పుట్టిన రోజు వేడుకల్లో వివాదం
- దుర్గారావు అనే వ్యక్తిని చితకబాదిన టీడీపీ సానుభూతి యువకులు
- చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి
- పోలీసుల అదుపులో నలుగురు యువకులు


మృతుడు దుర్గారావు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి జీవీఎంసీ 94వ వార్డు కృష్ణరాయపురంలో టీడీపీ సానుభూతి పరుల చేతిలో ఓ వ్యక్తి హతమయ్యాడు. గ్రామానికి చెందిన బొబ్బర దుర్గారావును అదే గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, అతని తమ్ముడు ప్రోద్బలంతో యువకులు కొట్టి చంపారని ఆరోపిస్తూ మృతుడి సోదరి నాగమణి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలివి..

కృష్ణరాయపురంలో క్రికెటర్ విరాట్ కోహ్లీ అభిమానులైన కొందరు యుకులు కోహ్లీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో స్థానికంగా నివాసం ఉండే బొబ్బర దుర్గారావు(38) అక్కడికి వచ్చాడు. వీరి మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో దుర్గారావును సదరు యువకులు విచక్షణా రహితంగా కొట్టారు. కిందపడ్డ దుర్గారావు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరాడు. పరిస్థితి గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న దుర్గారావు కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం దుర్గారావు మరణించాడు.

నా అన్న చావుకు టీడీపీ వాళ్లే కారణం

తన అన్న దుర్గారావు మరణానికి స్థానిక టీడీపీ నాయకులు బొబ్బర నరసింహనాయుడు, అతని సోదరుడు బొబ్బర నూకరాజే కారణమని దుర్గారావు సోదరి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి ప్రోద్బలంతోనే యువకులు తన అన్నను కొట్టి చంపారని, నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరింది. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో నిందితులు చిననూకరాజు, గౌతమ్, కార్తీక్, అజయ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: సీపీఎం

టీడీపీ నాయకుల వల్లే దుర్గారావు హత్య జరిగిందని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ ఆరోపించారు. గొడవ సమయంలో పెద్ద నూకరాజు, చిన్న నూకరాజు, వరలక్ష్మి, అజయ్, గౌతమ్, సంతోషి, కార్తీక్, లలిత మూకుమ్మడిగా దుర్గారావును కొట్టారని అన్నారు. హత్యకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీపీసీ కొత్త లోగో ఆవిష్కరణ


కొత్త లోగో ఆవిష్కరిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సిన్హా

పరవాడ: ఎన్టీపీసీ స్వర్ణోత్సవ(50వ ఆవిర్భావ దినోత్సవ) సంబరాలను పరిపాలన భవనం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఎన్టీపీసీ జెండాను ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా ఆవిష్కరించి గీత్‌ను ప్రారంభించారు. ఉద్యోగులను ఉద్దేశించి సంస్థ సీఎండీ గురుదీప్ సింగ్ ఇచ్చిన ప్రసంగాన్ని వినిపించారు. దీపాంజలినగర్‌లో ఆనందోత్సాహాల మధ్య స్వర్ణోత్సవ వేడుకలను జరిపారు. పలుచోట్ల రంగు రంగుల బెలూన్లు ఎగురవేశారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో నిర్దేశించిన అన్ని మైలురాళ్లను చేరుకునేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఇటీవల కాలంలో సింహాద్రి ఎన్టీపీసీ సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. ఎన్టీపీసీ 50 సంవత్సరాల కొత్త లోగోను సంస్థలోని వివిధ ప్రదేశాల్లో ప్రదర్శించారు. వేడుకల్లో చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.ఆర్.పరిడా, ఓ అండ్ ఎం జీఎం పి.కె.జెనా, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, అన్ని విభాగాల జీఎంలు పాల్గొన్నారు.